# విష్ణుచక్రం

"త్రేతాయుగంలో రామావతారం! ద్వాపర యుగంలో కృష్ణావతారం!! ఇలా యుగయుగానికీ తలెత్తిన రాక్షసత్వానికి ఒక్కో అవతారమెత్తి ఆ అకృత్యాలని అణచివేసాడా భగవంతుడు. ఈ కలియుగంలో వేళ్ళూనుకున్న 'లంచాల' నిర్మూలనకి ఏవేళ ఏ అవతారమై దిగివస్తాడో భువికి" అని గొణుక్కుంటూ యథాలాపంగా ఆఫీసులోకి అడుగుపెట్టాడు విష్ణుమూర్తి.

ఎన్నిసార్లు ఈ ఆఫీసు చుట్టూ తిరిగాడో, ఇంకెన్నిసార్లు తిరగాల్సి వుంటుందోనని క్యాలుక్యులేట్ చేసుకుంటూ సరాసరి బిల్ సెక్షన్‌లోకి నడిచాడు.

ఎప్పట్లా అక్కడి క్లర్కు జగన్నాథం చూపులు విష్ణుమూర్తి జేబుని డేగలా తడిమాయి. పెదవులు 'తెచ్చావా?' అనే పదాల్ని రిలీజ్ చేసాయి. ఆ క్లర్కు సాక్షాత్తూ 'లంచావతార పురుషుడి' ఏజంట్‌లా తోచాడు విష్ణుమూర్తికి.

బదులుగా "రెండు వందలకి మించి ఒక్క పైసా నావల్ల కాదండీ!" తెగేసి చెప్పాడు.

"అరే!? అలా అంటారేంటండీ! పదా ఇరవయ్యా.. మీ కొచ్చేది లక్ష, పర్సంటేజ్ బేస్ మీద లెక్కేసినా కనీసం వెయ్యయినా ఇవ్వకపోతే ఎట్లా?" చికాగ్గా అన్నాడు క్లర్క్.

"జీతాలు తీసుకుంటూ ఈ లంచాలేంటండీ?!" ఉక్రోషాన్ని అదిమిపెడ్తూ అసహనాన్ని వ్యక్తపరిచాడు మూర్తి.

"నారాయణమూర్తిలా ఆ రెడ్ మార్క్ చూపులూ, డిజిటల్ డైలాగులూ వొద్దుగానీ ఫ్రీగానే చేసి పెడతారే! ఓ పనిచెయ్, ఓ ఆర్నెల్లయ్యాక తిరిగ్గా కనబడు. రూల్స్ ప్రకారం వెళ్ళాలిగా మరి?" చివరి వాక్యాన్ని ఒత్తి పలుకుతూ, వెటకారంగా అన్నాడు.

"అయ్యయ్యో! అంతపనీ చేయకండి, ఈ సరికే బాగా లేటయ్యింది. కాస్త పని తొందరగా చేసి పెట్టండి. అవతల అమ్మాయి పెళ్ళి కుదుర్చుకున్నాను. డబ్బు అవసరం చాలా వుంది" పని ఆలస్యం చేస్తాడేమోనని భయపడి దీనంగా ప్రాధేయపడ్డాడు.

"అయితే నేనడిగిన ఎమౌంట్?"

"..............."

బదులుగా మౌనం వహించాడు.

"డబ్బవసరమంటావ్! అర్జంటు అంటావ్! ఓ వెయ్యి అడిగితే కుదరదంటావ్? నీతో ఇదెక్కడి పేచీ అయ్యా బాబూ! పైగా వెనకటికి నేను హరిశ్చంద్రుడినీ, నువ్వేదో నక్షత్రకుడివీ అయినట్లు" అంటూ మొహం చిట్లించాడు జగన్నాథం.

"వీడి పౌరాణిక పరిజ్ఞానం కూలా! డబ్బు కొరకు వెంటపడేది వీడైతేనూ... నన్ను నక్షత్రకుడితో పోలుస్తాడేంటీ!?" అనుకుంటూనే కనీసం కూర్చోమని మాట వరసకైన అనని అతగాడి కుసంస్కారానికి మనసులోనే తిట్టుకున్నాడు.

అయినా తనది లంచమిచ్చే కేసు కాదు కదా కనబడగానే హారతుల్తో ఎదురొచ్చి స్టాఫంతా రాచమర్యాదలందజేయడాని కని సరిపుచ్చుకున్నాడు.

పైకిమాత్రం.

"పైసకి పైసా ఆసరా అవుతుందండీ! అసలే పీకల్దాకా అప్పుల్లో కూరుకుపోయి వున్నాను. పైగా పిల్లపెళ్ళి. ఎన్ని అవసరాలుంటాయో కాస్త పెద్ద మనసుతో అర్థం చేసుకోండి?!" కరగక పోతాడా అని తిరిగి బ్రతిమిలాడాడు.

"నీలాంటి వాళ్ళ సాదక బాదకాలు అర్థం చేసుకొని ఆదుకునే మదర్ తెరిసా టైపు గొప్పోణ్ణి కాలేదింకా! అయ్యాక చూస్తాగానీ ప్రస్తుతం ఓ రెండొందలు తగ్గించుకొని ఎనిమిదివ్వు. నిన్ను నమ్ముతాను. పనయ్యాకే డబ్బులిచ్చేద్దువు. సరేనా?" డిస్కౌంట్ కూడా ఇచ్చేసా చూడూ అన్నట్లు విష్ణుమూర్తి మొహంలోకి తొంగి తొంగి చూసాడు... అలాగేనంటూ తలాడిస్తాడేమోనని.

తల కాదు కదా కాసేపటి దాకా పెదాలే ఆడించలేదతడు.

"ఈ రెండొందలు తప్ప ఇంకివ్వలేను. నన్నర్థం చేసుకొని దయతో ఎలాగైనా మీరే ఈ పని పూర్తి చేసి బిల్ పాసయ్యేటట్లు చూడండి" అంటూ కరాఖండిగా చెప్పేసి - వందనోట్లు రెండు క్లర్క్ టేబుల్ మీద పెట్టేసి జవాబు కొరకెదిరి చూడకుండా గబగబా వెనుదిరిగి వెళ్ళిపోయాడు.

ఇంకా ఆరొందలు ముట్టాక ఇతగాడి పని చూద్దాంలెమ్మని ఆ కాగితాల్ని జేబులో కుక్కుకున్నాడు.

✣ ✣ ✣

ఆఫీసర్ అచ్యుతరావుకి అసహనంగా వుంది. అంతకు మించి ఆందోళనగానూ వుంది. ఉండేలు దెబ్బ గురిపెట్టబడిన పిల్లకాకిలా గిలగిల్లాడిపోతున్నాడతను.

గుండెలో దడ, శరీరంలో వణుకు, కాలు నిలవట్లేదు. కుర్చీ పందెంలో పాల్గొన్నట్లు తన గదిలోనే కుర్చీ - టేబుల్ చుట్టూ తెగ పచార్లు చేస్తున్నాడు. ఏం చేయాలో పాలుపోవడం లేదు. హెవీగా తీసుకుంటే హెడేక్ కాబట్టి ప్రతిదీ లైట్‌గా తీసుకునే మనస్తత్వం అలవడింది. అలాంటిదీ రోజు ఇంతలా గాబరా పడ్తున్నాడంటే చెప్పేదేముంది? సీరియస్ మ్యాటరే

అయ్యింటుంది.

అచ్యుతరావు "ట్రింగ్" మని బెల్ నొక్కి ఫ్యూన్‌ని పిలిచి, అర్జంటుగా ఆఫీసు స్టాఫ్‌సంతా మీటింగ్ హాల్‌లో అసెంబ్లీ కావాలని ఆజ్ఞ పాస్ చేశాడు.

పదిహేను నిమిషాల్లో తిరిగొచ్చిన ఫ్యూన్ వినయంగా చెప్పాడు "అందరూ వచ్చి కూచున్నారు సార్! తమరెళ్ళడమే తరువాయి..." అని.

అతడు చెప్పిన వెంటనే ప్రపంచ కప్ ఓడిన క్రికెట్ టీమ్ లీడర్‌లా మొహాన్ని వేళ్ళాడదీసుకొని మీటింగ్ హాల్‌లోకి ఎంటరయ్యాడు.

ఆఫీసర్ గారి అకాల మీటింగ్ ఏర్పాట్లకి ఆచ్చెరువొందుతూ రకరకాల వ్యాఖ్యానాలు చేసుకుంటున్న సిబ్బందంతా ఆయన గారి రాకతో చప్పున నిశ్శబ్దమయ్యారు.

"డియర్ కొలీగ్స్! ఓ ఉపద్రవం ముంచుకు రాబోతోంది..." అంటూ ఆగేడు. సస్పెన్స్‌ని మెయింటెన్స్ చేస్తూ డైరెక్టర్‌కి స్టోరీ విన్పించే సినీ రచయితలా, మధ్యలో కటింగిస్తూ.

అందరి మొహాల్లోనూ ఆతృత... ఏమై వుంటుందని ! ప్రతి ఒక్కరి చూపుల్లోనూ ఆశ్చర్యం.... ఎలాంటిదై వుంటుందోనని!! క్యూరియాసిటీగా కుర్చీలోంచి మరికాస్త ముందుకి వంగారు.

"అమెరికా సాయంతో పాకిస్థాన్ మన దేశమ్మీద అణుబాంబులు కురిపించ బోతోందా సార్?" గురుడు టి.వి.లో ఫ్లాష్ న్యూసేమైనా చూసాడేమోనని అడిగేడు టైపిస్ట్ శ్రీను.

"అదేం కాదు. అరగంట క్రితం హైద్రాబాద్ నుండి ఇంపార్టెంట్ ఫోన్ కాల్ వచ్చింది..."

"మ్యాటరేంటి సార్?!" ఆతృతగా అడిగారెవరో.

"ఆంటీ కరప్షన్ కరీంనగర్ బ్రాంచ్ వాళ్లు సడెన్‌గా రైడింగ్ ప్రారంభించార్ట. ఏ క్షణంలోనైనా మన ఆఫీసు ఎంక్వైరీకి రావొచ్చని మెసేజ్ వచ్చింది. మరో వైపు నుండి పై ఆఫీసర్ ఫైళ్ల చెకింగ్‌కి వస్తున్నార్ట. సో అలర్ట్‌గా వుండండి!" చెప్పేడు అచ్యుతరావు.

గతుక్కుమన్నారంతా!!

ఆయన భయం ఆయనది. తమ ఆఫీస్ లంచాలకి బాగా అలవాటు పడిందని ఎవరో ఇన్‌ఫామ్ చేసుంటారు. అందుకే ఈ ఎ.సి.బి. వాళ్ళ రాకేమో! అయినా ఎవరు లంచాలు పుచ్చుకోవట్లేదు గనక... మున్సిపాలిటీ, పి.ఎఫ్., రెవెన్యూ, ఎలక్ట్రిసిటీ.. ఆఫీస్ వాళ్లంతా ఈ విషయంలో సదరు భాయీ భాయీలే కదా!

"ఫైళ్లన్నీ చాలా మట్టుకు పెండింగ్‌లో వున్నాయి సార్!" కళ్ళద్దాల్ని సవరించుకుంటూ గాబరాగా చెప్పాడు సూపరింటెండెంట్.

"అవునవున్సార్! దులిపితే గ్రాముల కొద్దీ బూజు, కిలోగ్రాముల కొద్దీ దుమ్ము రాలడం ఖాయం..." జోక్ చేసాననుకొని పడీపడీ నవ్వబోయి, అంతలోనే ఆఫీసర్ గారి సీరియస్ లుకింగ్ చూసి కామైపోయాడు శ్రీను.

"ముఖ్యమంత్రి గారు ఫైళ్ళ వారోత్సవాలు జరిపినప్పటి నుండే పెండింగ్ వర్క్‌ని నెమ్మదిగా కంప్లీట్ చేసినా బాగుండేది." నొచ్చుకునే ధోరణిలో కాకుండా నచ్చచెప్పే పద్ధతిలో చెప్పాడాయన. ఎందుకంటే అవి అలా మేరు పర్వతంలా పెరిగి పోవడానికి తనవంతూ షేర్ వుందిగా!

'లంచం' తాకిన అప్లికేషన్స్ పి.టి. ఉషకి సిస్టర్స్ అండ్ బ్రదర్స్‌లా అందరి చేతుల ఆశీర్వాద బలంతో చకచక పరుగిడితే... 'రొక్కం' వాసన వేయని అప్లికేషన్స్ 'శిలా విగ్రహాల్లా' బిగుసుకు పోవాల్సిందే! ఇలాంటి వాటితో మిగతా ఫైళ్లు ఆగిపోతున్నాయి.

"ఆ విష్ణుమూర్తి అప్లికేషనొకటి నొక్కి పట్టి ఉంచాం కదా! దాని కటాచ్‌మెంట్ ఫైల్సన్నీ గొలుసుకట్టులా ఆగిపోయాయి సార్! డబ్బేమో ససేమిరా ఇవ్వనంటాడు. ఎలా సార్?" అడిగేడు బిల్ సెక్షన్ జగన్నాథం.

"అతడి అప్లికేషన్‌ని వంకలుపెట్టి ఎప్పుడో రిజక్ట్ చేసి వుండాల్సింది. అనవసరంగా లాగారు. ఇప్పటికైనా మించిందిలేదు. ఆ పని త్వరగా కానివ్వండి" చెప్పాడు అచ్యుతరావు.

"అదెలా వీలవుతుందండీ! మీ సైన్‌తో ఫైల్ పుటపయ్యింది. పైగా అతగాడికి రిసిప్ట్ కూడా ఇచ్చాం. పనింకా అవలేదంటూ జాప్యం చేస్తూ అతడ్ని మన దారికి తెచ్చుకోవడం మినహా మనం చేయగల్గిందేమీలేదు"

"పైగా నిన్ననే హెడ్డాఫీసు నుండి బిల్ పాసై వచ్చింది..." చెప్పాడు క్లర్క్.

తల పట్టుకున్నాడు ఆఫీసర్.

"చిన్నాచితకా కాదు లక్ష రూపాయల బిల్ సార్! ఆస్ ఫర్ అవర్ క్రాస్ రూల్స్... అంత ఎమౌంట్‌కి మినిమం వెయ్యి కదా సార్ తీసుకోవాల్సింది. రెండొందలు మించి ఇవ్వనని మొండికేస్తున్నాడు" చెప్పాడు క్లర్క్.

విష్ణుమూర్తి విషయం ఓ విషమ సమస్యలా తోచింది అచ్యుతరావుకి.

"ఎ.సి.బి. వాళ్ళ చెకింగ్ సమయంలో విష్ణుమూర్తి గాని తగిలాడనుకోండి. మన పని గోవిందా! వాళ్ళతన్ని ఇంటరాగేట్ చేయకుండానే, అతగాడు మన విషయం బయట పెట్టొచ్చు.

అలా అయితే అందరికందరం బుక్కయిపోతాం. పైగా బిల్ పాసై వచ్చినా అతడికందలేదంటే అనుమానం బలపడ్తుంది. ఎవరు ఆరాలు తీసినా మనం బయట పడిపోతాం. కీడెంచి మేలెంచాలి" అంటూ ఆగేడు.

"అయితే ఏం చేద్దామంటారు?!!" సూపరింటెండెంట్ అడిగాడు.

"ఆయనెంతిస్తే అంతే తీసుకోండి. ఇవ్వకపోయినా ఆ బిల్ అప్పచెప్పి వదిలించుకోండి..." అని సూచించాడు ఆఫీసర్.

ఆ ప్రాబ్లమ్ కొంతలో కొంత అలా సాల్వ్ అయినందుకు హాయిగా ఊపిరి పీల్చేసుకుంటూ 'సరే' నని తలలూపారిద్దరూనూ.

"సో డియర్ కొలీగ్స్! చివరగా మీకు నే చెప్పొచ్చేదేమంటే అప్ టుడేట్ ఫైల్సన్నీ

క్లీన్ అండ్ క్లియర్ చేసేసుకోండి. మాగ్జిమమ్ హార్డ్‌వర్క్ చేయండి. వీలయితే హోమ్ వర్క్ చేసైనా పని పూర్తి కానివ్వండి. నేనూ మీవెంటే వుంటాను. ఏ ప్రమాదాలకి తావివ్వకుండా నడుచుకోండి పట్నాల్!!" అంటూ సమావేశాన్ని ముగించాడు.

ఎవరి సీట్లలోకి వాళ్ళు నిశ్శబ్దంగా వెళ్లిపోయారు.

మర్నాడు బిల్‌ని కృష్ణమూర్తికి అందజేసాడు జగన్నాథం. ఏ క్షణంలోనైనా ఎ.సి.బి. వాళ్ళో, పై ఆఫీసర్లో షాకింగ్ దాడి జరపొచ్చని క్షణం తీరిక లేకుండా కిందామీదా పడి రెండ్రోజుల్లో ఫైళ్ళన్నిటిని వాష్ అవుట్ చేసారు.

ఆఫీసర్ అచ్యుతరావుతో సహా స్టాఫంతా బితుకు బితుకు మంటూ బుద్ధిగా వర్క్ చేసుకోవడం మొదలెట్టారు. 'అయ్యవార్ల' రాకకోసం కంటిమీద 'పగటి కునుకు' లేకుండా ఎదురు చూడసాగారు.

ఒకటి...

రెండు...

మూడు...

అలా వారం - నెల దాటినా వాళ్ళ ఆగమనం జరుగలేదు. వీళ్ళు ఎదిరిచూడ్డం ఆపనూ లేదు.

✣ ✣ ✣

ఇప్పట్లో వాళ్ళు రారన్న నిజం ఒక్క విష్ణుమూర్తికే తెలుసు. ఎందుకంటే ఉత్తుత్తి ఫోన్‌కాల్ సృష్టించి... స్టాఫ్‌ని హడలెత్తించి... తన పని సులువుగా పూర్తి చేసుకున్నది విష్ణుమూర్తి కనుక!!

కొన్ని రోజులయ్యాక నైనా విషయం బయటపడొచ్చు. తనే దీనికంతటికి కారణభూతుడు అని ఊహించగలిగినా తనని వాళ్ళేం చేయలేరన్న ధీమా వుంది విష్ణుమూర్తికి.

ఎందుకంటే -

అతను తిప్పిన చక్రంతో పని పూర్తయిందిగా!!

ఈ దెబ్బతో -

కనీసం కొన్నాళ్ళ వరకైనా లంచాల జోలికి పోరని... తనలాంటి వాళ్ళు కొందరైనా వాళ్ల ఉచ్చుల బారి నుండి బయటపడి... పైసా ఖర్చులేకుండా పని పూర్తి చేసుకుంటారన్న సంతృప్తి కూడా మిగిలింది విష్ణుమూర్తికి.

(నవంబర్, 1999)

✻